సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



సేద్యం సాధ్యమే

సేద్యాన్ని పండగలా మార్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్నం పెట్టే అన్నదాతకు అన్నివేళలా సర్కారు అండగా ఉంటోంది.

- 8లో



జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

కోవిడ్ రెండో దశ సమయంలో ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయి. కోవిడ్ డెల్టా వేరియంట్ పంజా విసరడంతోఆక్సిజన్ కొరత ఏర్పడింది.

- 8లో



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

సాలూరు పట్టణంలోని 1,2వ వార్డులకు చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు.

- 8లో

న్యూస్‌రీల్

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మోహర్దా

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఎలిమెంటరీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్‌బూత్‌లను అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మోహర్దా ఆదివారం పరిశీలించారు. మామిడిపల్లిలో ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా అధికారులు గతంలో గుర్తించడంతో వాటిని ఆయన పరిశీలించి తగు జాగ్రత్తలను పోలీసు అధికారులు తీసుకోవాలని కోరారు. సాలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి విష్ణుచరణ్, రూరల్ సీఐ బాలకృష్ణ, పట్టణ సీఐ వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా రిసెప్షన్ కౌంటర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరగాలని, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. కౌంటర్ల ఏర్పాటు, విధులు, సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. రోజంతా ఎంతో కష్టపడి ఎన్నికల విధులను నిర్వహించి, ఈవీఎం ఇతర సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బంది బస్సుల్లో నుంచి దిగగానే తాము వెళ్లాల్సిన కౌంటర్లకు సులభంగా చేరుకునేలా డైరెక్షన్ బోర్డులు, నేమ్ బోర్డులు ఉండాలన్నారు. తాగునీరు, ఫుడ్ కౌంటర్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలను తెలియజేసేలా పెద్దసైజులో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో నియోజకవర్గానికి సుమారు 10 నుంచి 12 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే ఈవీఎలను, ముఖ్యమైన పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. సాధారణ కౌంటర్లలో ఇతర ఎన్నిక సామగ్రిని సమర్పించాలని చెప్పారు. స్పెషల్ కౌంటర్‌లో నలుగురు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- యువతకు పిలుపునిచ్చిన మేఘాలయ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.ఎస్.కుమార్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.ఎస్.కుమార్

రాజాం సిటీ: యువత ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని మేఘాలయ చీఫ్ సెక్రటరీ, మాజీ ఐఏఎస్ కె.ఎస్.కుమార్ అన్నారు. స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సివిల్ సర్వీసెస్‌పై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు ఫౌండేషన్ ద్వారా అండగా నిలుస్తున్న మదన్‌ను అభినందించారు. ఈ ప్రాంతంలో ఎంతోమంది తెలివైన యువతీయువకులు ఉన్నారని, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఐజీ జీహెచ్‌పీ రాజు, మాజీ ఐఏఎస్ ఎన్.సాంబశివరావు, ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ డి.కల్యాణచక్రవర్తి, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, వి.జగన్నాథంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో.. అభివృద్ధి ఘనం

పార్వతీపురం అంటేనే ఏజెన్సీకి ముఖద్వారం. వెనుకబడిన ప్రాంతం. కొండకోనలు.. దూరంగా విసిరిసేలా ఉండే గిరిశిఖర గ్రామాలు..ఒడిశా రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతంలో గిరిజన జనాభా అధికంగానే ఉన్నారు. వలసల ప్రాంతంగా ఉన్న పార్వతీపురం.. నేడు ఆ పేరును చెరిపేసేలా అభివృద్ధి దిశగా పయనిస్తోంది.

- 58 నెలల్లోనే..సాధ్యం చేసి చూపిన ప్రభుత్వం
- జిల్లా ఆవిర్భావం తర్వాత దూసుకుపోతున్న ప్రగతి



పార్వతీపురం

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాల ఆవిర్భావం తర్వాత పార్వతీపురం ప్రధాన కేంద్రంగా సాలూరు, కురుపాం..శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గాలతో కలిపి పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడింది. మొత్తంగా నాలుగు నియోజకవర్గాలతో విస్తరించి ఉన్న జిల్లాలో కేవలం 58 నెలల కాలంలోనే ఎంతో ప్రగతి సాధించింది.

రూ.100 కోట్లతో సమీకృత కలెక్టరేట్ సముదాయం



కలెక్టర్ కార్యాలయం

కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో కలెక్టరేట్‌తోపాటు, ఇతర జిల్లా కార్యాలయాలన్నీ ఏర్పాటయ్యాయి. దీంతోపాటు..పార్వతీపురంలోనూ, సీతంపేటలోనూ ఐటీడీఏల ద్వారా గిరిజనులకు మెరుగైన సేవలందుతున్నాయి. ప్రస్తుతానికి ఐటీడీఏ కోసం నిర్మించిన భవన సముదాయంలోనే కలెక్టరేట్ నడుస్తోంది. శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఇటీవలే రూ.99.90 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని అడ్డాపుశీలలో నిర్మించనున్నారు. స్థలం ఎంపిక కూడా పూర్తయింది. ఇందుకోసం 59.80 ఎకరాల భూమిని కేటాయించారు.

సొంతింటి కల సాకారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా పేదల సొంతింటి కల సాకారమైంది. జిల్లావ్యాప్తంగా 27,142 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటికే 14 వేల మంది నిర్మాణం పూర్తి చేసుకుని, గృహ ప్రవేశాలు చేశారు. పీఎంఏవై– గ్రామీణ్ పథకం కింద 2021– 22 సంవత్సరానికి 7,306 ఇళ్లు మంజూరు కాగా.. 1,400కుపైగా పూర్తయ్యాయి. సాలూరు పురపాలక సంఘం పరిధిలో 1,152 మందికి టిడ్కో గృహాలను ఇటీవలే లబ్ధిదారులకు అప్పగించారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 768 గృహాలను అందజేయనున్నారు.



పార్వతీపురం మండలంలో జగనన్న కాలనీ

ఇవి కాక.. జిల్లాలో 311 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం ప్రారంభం కాగా..130కిపైగా పూర్తయ్యాయి. 301 ఆర్‌బీకేలు, 192 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 85 డిజిటల్ లైబ్రరీలు, 19 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు మంజూరు కాగా.. చాలావరకూ పూర్తయ్యాయి.



జిల్లా ఆస్పత్రి

అందుబాటులోకి విద్య, వైద్యం

జిల్లాకొక వైద్యకళాశాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించనున్నారు. పార్వతీపురం, సీతంపేటల్లో రూ.50 కోట్ల చొప్పున వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరగనుంది. పలు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను ఆధునికీకరించారు. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఏజెన్సీ వాసులకు వైద్యపరమైన కష్టాలు తప్పుతాయి.

సాలూరులో గిరిజన వర్సిటీ

సాలూరు నియోజకవర్గం పరిధిలో విశాలమైన ప్రాంగణంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణ పనులు సాగుతున్నా యి. కేంద్ర ప్రభుత్వం రూ.835 కోట్లను మంజూరు చేస్తే..రాష్ట్ర ప్రభుత్వం 519 ఎకరాల భూమితో పాటు, మంచినీటి సరఫరా కోసం రూ.7 కోట్లు, అనుసంధాన రహదారులు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.16 కోట్లు, విద్యుత్తు సదుపాయానికి రూ.3.34 కోట్లు కేటాయించింది.



వేలాది ఉద్యోగాల భర్తీ

సచివాలయాలతో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 350 సచి వాలయాలుండగా.. ఇందులో 3,500 పోస్టులను అర్హతే ప్రామాణికంగా భర్తీ చేశారు. వారికి అనుగుణంగా 5,600 మంది వలంటీర్లను గౌరవ వేతనంతో నియమించారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు నాలుగు చోట్ల ఉన్నాయి. ఇక్కడ 1,300 మందికిపైగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 1,631 మంది ఉద్యోగులు సర్వీసు క్రమబ ద్ధీకరణకు నోచుకున్నారు.

కురుపాలో ఇంజినీరింగ్ కళాశాల



కురుపాంలో గిరిజన విశ్వవిద్యాలయం

కురుపాం నియోజకవర్గ పరిధి కురుపాం పంచాయతీలో ఉన్న టేకరఖండి గ్రామ సమీపంలో 105 ఎకరాల్లో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ కళాశాల పూర్తయితే మన్యం జిల్లాలో ఉన్న కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల పరిధిలోని అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందే అవకాశం ఉంది.

'సంక్షేమ' దన్ను

ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా నిరక్షరాస్యులే. గతంలో వారికి ఏ పథకాలూ సక్రమంగా అందేవి కావు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి మారింది. లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా ప్రభుత్వం నగదు జమ చేయడం వల్ల ఆ మొత్తం వారి ఆర్థిక అవసరాలకు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

పారిశ్రామిక ప్రగతి దిశగా..

జిల్లాలో పరిశ్రమల ఆవశ్యకత చాలా ఉంది. యువతకు ఉపాధి కల్పనకు, వలసల నివారణకు పారిశ్రామికీకరణ చాలా అవసరం. జిల్లాలో ఈ ఏడాది సింగిల్ డెస్క్ విధానంలో రూ.48.29 కోట్ల విలువ పెట్టుబడులు గల 50 యూనిట్లకు అనుమతులు మంజూరు చేశారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

మన్యం జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. పీఎంజీఎస్‌వై, ఆర్‌సీఈపీఎల్‌డబ్ల్యూ తదితర గ్రాంట్ల కింద 1,008 రహదారి పనులు రూ.1,260 కోట్లతో జరుగుతున్నాయి. కేవలం గత ఏడాది కాలంలోనే 58 రహదారులకు అటవీ అనుమతులు మంజూరు చేసి మారుమూల ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో సమాచార వ్యవస్థను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి 196 4జీ సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో సగానికిపైగా పూర్తయి సేవలందిస్తున్నాయి.

పర్యాటక సొబగు

అందమైన, సుందర ప్రదేశాలు గల జిల్లాలో పర్యాటకానికి ఎన్నో అవకాశాలున్నాయి. వాటిని వినియోగించుకుని పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటకానికి నిలయంగా మారాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధానంగా సీతంపేటలో గిరిజన మ్యూజియం, జగతిపల్లి, అడలి వ్యూ పాయింట్‌ల వద్ద పర్యాటక పనులను రూ.1.40 కోట్లతోనూ, గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్.కె.పాడులో ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు రూ.1.80 కోట్లతోనూ చేపడుతున్నారు.



జియ్యమ్మవలస మండలంలో బల్లేరు నుంచి బల్లేరుగూడకు బీటీ రహదారి

పాఠశాలల అభివృద్ధి

నాడు–నేడుతో ప్రభుత్వ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. తొలిదశలో 486 పాఠశాలల్లో రూ.130.14 కోట్లలో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతో రూ.144.51 కోట్లతో 535 పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లను ఏటా ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో మూడు జతల యూనిఫాం దుస్తులు(క్లాత్), బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీ వంటివి ఉంటాయి. జిల్లాలో ఏటా సుమారు 96 వేల మంది విద్యార్థులు ఈ లబ్ధి పొందగా.. ప్రభుత్వం ఇందుకోసం రూ.18 కోట్లకు పైగా ఏడాదికి ఖర్చు చేస్తోంది. పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం గత ఏడాదిలోనే రూ.35.23 కోట్లను జిల్లాలో ఖర్చు చేశారు.

వైఎస్సార్ పింఛన్‌కానుక కింద 1,43,000 మంది పింఛనుదారులకు నెలకు రూ.37 కోట్లు పంపిణీ చేస్తున్నారు. 'వైఎస్సార్ ఆసరా కింద 16,699 మహిళా సంఘాలకు రూ.378 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 77,995 మందికి రూ.147 కోట్లు, వైఎ స్సార్ కల్యాణమస్తు కింద 1,700 మందికి రూ. 11.84 కోట్లు, వాహనమిత్ర పథకం ద్వారా సొంత ఆటో, ట్యాక్సీ నడిపేవారికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు అందించారు. ఇలా జిల్లాలో ఏడాదికి 5,664 మంది రూ.8.28 కోట్ల మేర లబ్ధి పొందారు. జగనన్న తోడు 7,460 మందికి రూ.7.59 కోట్లు చొప్పున లబ్ధి కలుగుతోంది.



సామాజిక పింఛన్ల పంపిణీ(ఫైల్)

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయింపునకు రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం పూర్తయింది. ఈ ప్రక్రియను అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా పర్యవేక్షణలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

సాధారణ ఎన్నికల్లో పోలింగ్ విధులకు హాజరు కానున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు మే 5వ తేదీన, పోలీసు సిబ్బంది మే 6వ తేదీన, అత్యవసర సేవలు, ఇతర శాఖల సిబ్బంది మే 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనివార్య కారణాలవల్ల నిర్దేశించిన రోజుల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశంలేని సిబ్బంది ఆ మూడు రోజుల్లో ఏదో ఒక రోజు ఓటుహక్కును వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా, కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ శోభిక, డీఆర్ఓ కేశవనాయుడు

ప్రభుత్వ పనిప్రదేశంలో ప్రచారం?

- ఎన్నికల అధికారులు స్పందించాలని వైఎస్సార్‌సీపీ విన్నపం

సాలూరు: ప్రభుత్వ నిధులతో పని జరుగుతున్న ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం చేయడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు కాదా? అని వైఎస్సార్‌సీపీ పాచిపెంట మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని కర్రివలస పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పని జరుగుతున్న ప్రాంతం వద్దకు సాలూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి శనివారం వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న వేతనదారులకు స్థానిక టీడీపీ నాయకులు ఆ పార్టీ టోపీలను పంచిపెట్టగా, సంధ్యారాణి ప్రచారం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. ఇలా ప్రభుత్వం వేతనాలు ఇస్తున్న ఉపాధి హామీ పని ప్రాంతానికి వెళ్లి సంధ్యారాణి ప్రచారం చేయడం, పైగా అక్కడ వేతనదారులందరికి టీడీపీ టోపీలు ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు వస్తుందా? రాదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్తామని, ఈసీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించాలని కోరారు.



వేతనదారులకు టీడీపీ టోపీలు ఇచ్చి ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని సంధ్యారాణి

చెత్త ఫొటోలతో చెత్త వార్తలు

- పత్రిక కథనంపై వండువ పంచాయతీ ఆగ్రహం
- 'ఈనాడు' ప్రతులను దహనం చేసిన గ్రామస్తులు

వీరఘట్టం:

రోడ్డు పక్కన ఉన్న చెత్త ఫొటోలు తీసి చెత్తవార్తలు రాయొద్దంటూ ఈనాడు దినపత్రికపై వీరఘట్టం మండలంలోని వండువ గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు మండిపడ్డారు. ఈ సంఘటనకు దారితీసిన కారణాలిలా ఉన్నాయి. పాలకొండ ఎమ్మెల్యేగా ఉన్న విశ్వాసరాయి కళావతి తన స్వగ్రామం వండువలో కనీసం అభివృద్ధి చేయలేదంటూ ఆదివారం ఈనాడులో వచ్చిన 'వండువను వదిలేశారు' కథనంపై గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లుగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పంచాయతీ పాలకవర్గంలో అందరూ మహిళలు ఉన్న ఏకైక పంచాయతీ వండువ అని సర్పంచ్ మిడతాన కల్యాణి స్పష్టం చేశారు. ఆదర్శ పంచాయతీగా ఉన్న వండువపై బురదజల్లే వార్తలు రాస్తే ఈనాడు పత్రికను గ్రామంలో శాశ్వతంగా బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం సర్పంచ్ కల్యాణి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వండువ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వండువ గ్రామస్తులు

ఇనాం భూములకు ప్రత్యేక జీఓ

వండువ గ్రామంలో 1250 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయి. సాగులో ఉన్నప్పటికీ సాగు హక్కు లేక గత 150 ఏళ్లుగా తాత ముత్తాతల కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యను ఎమ్మెల్యే కళావతి రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపారు. మా ఇనాం భూములకు ప్రత్యేక జీఓ తీసుకువచ్చారు.ఎమ్మెల్యే కళావతి చొరవతో రెండేళ్లుగా రైతు భరోసా కూడా వస్తోంది. ప్రస్తుతం జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూసర్వే జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో మా భూములకు సాగు హక్కు పట్టాలు రానున్నాయని, ఎమ్మెల్యే కళావతి చొరవతోనే ఇది సాధ్యమైందని సర్పంచ్ కల్యాణి అన్నారు. ఇది అభివృద్ధి కాదా? అని ఈనాడును ఆమె ప్రశ్నించారు.



సమావేశంలో పాలకవర్గంతో కలిసి మాట్లాడుతున్న సర్పంచ్ మిడతాన కల్యాణి

- గ్రామంలో సుమారు రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టాం.
- రూ.40 లక్షలతో నూతనంగా సచివాలయం భవనం నిర్మాణం
- రూ.19 లక్షలతో ప్రాథమిక పాఠశాల, రూ.52 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాడు–నేడు ద్వారా అభివృద్ధి
- సొంతిల్లులేని 72 మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు

జగనన్న కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులు

ఇవన్నీ ఈనాడుకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విశ్వాసరాయి భార్గవ్, మాజీ ఎంపీటీసీ మనోరమ, పంచాయతీ పాలకవర్గం సభ్యులు గొర్లె అప్పలనరసమ్మ, కొట్టిశ సరస్వతి, పంట్ల అప్పలనరసమ్మ, అలజంగి జయమ్మ, భూరి ఆరుద్రమ్మ, గంగాడ కళావతి, లక్కోజు భూలక్ష్మి, గొర్లె సరస్వతమ్మ, ఉకలాపు అరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేయాలి

• జేసీ ఎస్ఎస్.శోభిక



పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురం: కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఆదివారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురంలోని డా.వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికలలో భాగంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం శాసనసభ నియోజకవర్గాలో ఓట్ల లెక్కింపు కోసం ఉద్యాన కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు, మీడియా సెంటర్ ఏర్పాటు చేయాల్సిన వివిధ విభాగాలను నిశితంగా పరిశీలించారు. వివిధ శాఖలకు కేటాయించిన పనుల పురోగతిని సమీక్షించారు. రెవెన్యూ, పోలీసు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకు అప్పగించిన పనులను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్ షరోన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వీవీ.రమణ, డీపీఆర్ఓ బి.సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఈఈ ఎస్.వేణుగోపాలరావు, ఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బాలేరు సమీపంలో ఏనుగులు



బాలేరు సమీప పంటపొలాల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీప తోటల నుంచి ఏనుగుల గుంపు ఆదివారం బాలేరు వైపు నడిచింది. తోటల సమీపంలోని మొక్కజొన్న పంటల కోతలు పూర్తి కావడంతో సరైన మేత లేక బాలేరు పంటపొలాలకు తరలివెళ్లాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా ఉదయానికే పంటపొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు పంట చేలను తినివేశాయని రైతులు వాపోతున్నారు. పచ్చని పంట పొలాల్లో ఏనుగులు విచ్చలవిడిగా తిరుగాడాయని తెలిపారు.

రామతీర్థంలో ఆదిత్య హృదయ హోమం



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో సుందరకాండ, ఆదిత్య హృదయం, గాయత్రీ రామాయణం, సుదర్శన అష్టకం, సుదర్శన హవనం, తదితర హోమాలను వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సంతకవిటి: నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తాలాడ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యవసాయం తప్ప మరో వ్యాపకం తెలియని అన్నదాతలు.. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో సాగు విషయంలో పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. విత్తనం కావాలంటే వ్యవసాయ కార్యాలయాలకు వేకువజామున చేరుకోవాల్సిన పరిస్థితి. సాగుకు ఎటువంటి సాయం లేదు. చివరకు పంట విక్రయించేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. అటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. జగనన్న రాజ్యం వచ్చింది. వ్యవసాయం పండగలా మారింది. సాగులో పెట్టుబడి సాయం నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు అన్నీ తానై జగనన్న ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంది. దీంతో వ్యవసాయం లాభదాయకంగా మారింది.



పాలకొండ మండలం తంపటాపల్లి రైతు భరోసా కేంద్రం

సేద్యం సాధ్యమే

- ఆర్‌బీకేలతో అన్నదాతకు భరోసా
- అన్నదాతకు అండగా కేంద్రాలు
- 306 ఆర్‌బీకేల ద్వారా లక్షా 46 వేల మంది రైతులకు సేవలు
- రైతు భరోసా సాయం పెంపు



నాడు విత్తనాల కోసం పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద రైతుల అవస్థలు(ఫైల్)



నేడు లుంబూరు గ్రామంలో ఆర్‌బీకే వద్దనే సీడ్ ప్యాకెట్లతో రైతులు

పాలకొండ రూరల్: సేద్యాన్ని పండగలా మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్నం పెట్టే అన్నదాతకు అన్నివేళలా సర్కారు అండగా ఉంటోంది. కర్షకుల ఆకాంక్షకు తగ్గట్లు రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు పల్లెవాకిటకు రైతు భరోసా కేంద్రాలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చింది. విత్తనం అందించడం మొదలు పెట్టుబడి సాయం, ఎరువులు, సలహాలు, సూచనలు, అధికారుల క్షేత్ర పర్యటనలు, యాంత్ర పరికరాల అందజేత, దిగుబడి పొందేందుకు సహకారంతో పాటు పంటల దిగుబడి కొనుగోలు వరకూ జగనన్న ప్రభుత్వం అన్నదాతలతో మమేకమై రైతు పక్షపాతిగా మారింది.

322 మంది వ్యవసాయ క్షేత్ర సహాయకులు

వ్యవసాయ ఆధారిత పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలకు సంబంధించి 456 గ్రామ పంచాయతీల్లో 955 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఏటా మూడు లక్షల ఎకరాలకు పైబడి సేద్యం జరుగుతుంది. 1,46,016 మందికి పై చిలుకు రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. వారిలో సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు పొందిన కౌలురైతులు ఉన్నారు. వారికి సేవలు అందించేందుకు రైతు బాంధవుడుగా పేరుగాంచిన దివంగత రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేశారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా రైతుల సేవల కోసం 306 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 322 మంది వ్యవసాయ క్షేత్ర సహాయకులను సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించి అన్నివేళలా రైతులకు అండగా ఉండేలా చర్యలు చేపట్టింది. వీరు విత్తనం మొదలుకుని దిగుబడి విక్రయం వరకూ రైతుకు సహకరిస్తున్నారు.

ఏటా క్రమం తప్పకుండా..


జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 3.27లక్షల ఎకరాల్లో సాధారణ, ఉద్యానవన పంటలు పండిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రబీలో 28,345 హెక్టార్లకు పైబడి వివిధ రకాల పంటలను లక్షా 18వేల మందికి పైచిలుకు రైతులు పండిస్తున్నారు. ఈ క్రమంలో ఏటా ఆర్‌బీకేల ద్వారా ఖరీఫ్‌లో 35వేల క్వింటాళ్ల విత్తనాలు, 12,120మెట్రిక్ టన్నుల ఎరువులు, రబీలో ముందుగానే విత్తనాలు 2,356 క్వింటాళ్లు, ఎరువులు 2,575మెట్రిక్ టన్నుల ఎరువులు ఏటా ఆర్‌బీకేల ద్వారా సమకూరుస్తున్నారు. గతంలో రైతుకు ఏచిన్న అవసరం వచ్చినా మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయానికి వెళ్లేవారు. జగనన్న ప్రభుత్వంలో పల్లెల్లో ఆర్‌బీకేలు నెలకొల్పడంతో సొంత ప్రాంతాల్లో అన్ని సేవలూ పొందుతున్నారు. జిల్లాలో 280 కస్టమ్ హైరింగ్ కేంద్రాల ద్వారా ఏటా సుమారు రూ.9కోట్లు విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను క్షేత్ర స్థాయిలో రైతు సంఘాలకు రాయితీపై అందిస్తూ సేద్యాన్ని పరుగు పెట్టించారు.

అన్నిదశల్లోనూ..

రైతన్నకు ఈ ప్రభుత్వం అన్ని దశల్లో అండగా ఉంటుంది. నవరత్నాల్లో భాగంగా సేద్యం చేసేందుకు ఏటా వ్యవసాయ సీజన్లకు ముందుగా రైతుభరోసా పేరిట ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ క్రమంలో వరుసగా అందించిన రైతు భరోసాతో రైతులు పొలంబాట పట్టారు. సాధారణ రైతులతోపాటు కౌలు చేస్తున్న 9,256 మందికి సీసీఆర్‌సీ కార్డులు అందించి వారికి కూడా రైతుభరోసా వర్తింపజేస్తున్నారు. ఈ క్రాప్ నమోదుతో అన్నిదశల్లో అండగా ఉంటున్న సర్కారు అనుకోని విపత్తుల బారినపడి పంట నష్టపోతే రైతుపై భారం పడకుండా ఉచిత పంటల బీమాతో ఆదుకుంటున్న తీరును రైతులు హర్షిస్తున్నారు.

సాంకేతిక మేళవింపు..

వ్యవసాయానికి సాంకేతికతను మేళవింపు చేసేందుకు 261ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. తద్వారా రైతులకు అవసరమయ్యే అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు కావాల్సిన కంపెనీల నుంచి పొందవచ్చు. ఆర్థిక లావాదేవీలు జరుపవచ్చు. వాటిద్వారా కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు 48 గంటల్లో రైతుకే నేరుగా అందిస్తారు. వారు పండించిన పంట రాష్ట్రంలో ఎక్కడైనా, ఏ మార్కెట్‌లో అయినా గిట్టుబాటు ధర తెలుసుకుని అమ్మకాలు చేసుకోవచ్చు. ముఖ్యంగా ఈ కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు పొందవచ్చు. ఈ క్రాప్ నమోదు ద్వారా తాము సాగు చేసిన పంటల వివరాలు అధికారులు నమోదు చేస్తారు, ఈ సర్టిఫికెట్ ద్వారా నష్ట పరిహారాలు, పంట రుణాలు పొందేలా వెసులుబాటు కల్పించారు. పంట కోత ప్రయోగాలతో దిగుబడి నిర్ధారిస్తారు. వ్యవసాయంతోపాటు పాడి, మత్స్యకార రైతులకు ఆర్‌బీకేల్లో ఉన్న పశుసంవర్ధక కార్యదర్శి సూచనలు, సలహాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంటారు.



ఐదు విడతల్లో రైతు భరోసా వివరాలు ఇలా..

అన్నదాతకు ఆర్థిక సాయం అందించే క్రమంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏటా రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం అందిస్తోంది. రైతు పక్షపాతిగా పేరుపొందిన ఈ ముఖ్యమంత్రి ఎన్ని అడ్డంకులు ఎదురైనా రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. పంటల సీజన్‌కు ముందుగానే భరోసా నిధులు నేరుగా రైతు ఖాతాలకు జమచేస్తుండడంతో అప్పుల బారిన పడకుండా రైతుసేద్యంపై దృష్టి సారించగలుగుతున్నాడు.

సంవత్సరం	లబ్ధిదారులు	అందించిన మొత్తం (లక్షల్లో)
2109-20	1,07,729	145.43
2020-21	1,29,027	174.19
2021-22	1,34,657	181.79
2022-23	1,39,505	188.050
2023-24	1,46,016	196.24

వైఎస్సార్‌సీపీ అధినేత తాజాగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా సాయాన్ని రూ.**16,000**కు పెంచడంతో అన్నదాతల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది.

రైతుకు మంచిరోజులు

జగన్ ప్రభుత్వంలో రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఆర్‌బీకే వ్యవస్థ సత్ఫలితాలను తెచ్చింది. గ్రామాల్లో అధికార కార్యాలయాలు, అధికారులు అందుబాటులో ఉంటున్నారు. గత ప్రభుత్వాలు రైతును పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలో అధికారి రైతు కుటుంబ సభ్యుని మాదిరి అనుక్షణం అండగా ఉంటున్నారు. విత్తనాలు అందించిన క్షణం నుంచి దిగుబడి అమ్మకాలు జరిగి, ఆమొత్తాలు మా బ్యాంకు ఖాతాలకు చేరేవరకూ సమాచారం అందిసున్నారు. శ్రమ తగ్గింది. దిగులు తీరింది. ముఖ్యంగా రైతు భరోసా నిధులను పెంచుతూ జగన్‌మొహన్ రెడ్డి తన మేనిఫెస్టోలో తీసుకున్న నిర్ణయంతో మారోమారు రైతు పక్షపాతి అనిపించుకున్నారు.

– ఎస్.జగ్గారావు, రైతు, నేరడి–బి, భామిని మండలం

జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

- నిమిషానికి 1,000 లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం
- 100 పడకలకు ప్రాణవాయువు అందజేసే అవకాశం
- రూ.1.10 కోట్లతో ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం



జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

పార్వతీపురంటౌన్: కోవిడ్ రెండో దశ సమయంలో ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయి. కోవిడ్ డెల్టా వేరియంట్ పంజా విసరడంతో లక్షలాది మంది ఒకేసారి ఆస్పత్రుల పాలవడంతో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. ఆ సమయంలో సరిపడా ఆక్సిజన్ లేక రోగులు చాలా ఇబ్బంది పడ్డారు. సకాలంలో ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. ఇలాంటి పరిస్థితికి చెక్ చెప్పాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఆస్పత్రిలో రూ.1.10 కోట్ల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించి, ఏడాది క్రితమే అందుబాటులోకి తీసుకువచ్చింది. నేరుగా గాలి నుంచి ఆక్సిజన్ తయారు చేసి దానిని పైపుల ద్వారా ఆస్పత్రిలోని వార్డుల్లో గల పడకలకు అనుసంధానం చేయడంతో పాటు అవసర మైనప్పుడు రోగులకు అందిస్తున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'100 పడకలకు అందుబాటులో'..

ప్లాంట్ ద్వారా నిమిషానికి వెయ్యిలీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తారు. దీంతో 100 పడకలకు ఒకేసారి ఆక్సిజన్ అందించవచ్చు. ఇప్పటివరకు సిలిండర్ల ద్వారా బయటనుంచి కొనుగోలు చేసి ఆస్పత్రిలోని రోగులకు ఆక్సిజన్ అందించేవారు. సిలిండర్లు ఖాళీ అయిన తర్వాత మళ్లీ రీఫిల్ చేయించే వారు. కరోనా రెండో వేవ్ సమయంలో ఆక్సిజన్‌కు భారీ డిమాండ్ ఏర్పడడంతో సిలిండర్లు అందుబాటులో లేక, ఉన్నా ఆక్సిజన్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆక్సిజన్ కోసం మూడు, నాలుగు రోజులు సైతం వేచి ఉండాల్సి వచ్చింది. ఇటువంటి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో సాధారణ వైద్య సేవలతో పాటు అత్యవసర చికిత్సల సమయంలో కూడా ఆక్సిజన్ కొరత ఉండడం లేదు. జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం మరో 200 బెడ్లు ఏర్పాటు చేసుకునేలా నూతన భవనాన్ని నిర్మించిన నేపథ్యంలో వాటికి కూడా ఈ ప్లాంట్ ద్వారా ఆక్సిజన్ అందించే సదుపాయం ఏర్పాటు చేసుకోవచ్చు.

కొరియా గ్రామాల్లో ఈదురుగాలులు

• ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు



రాలిపడిపోయిన ఇంటి పైకప్పులు

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన కొఠియా గ్రూప్ గ్రామాలు పట్టుచెన్నూరు, కుడకారు, శిఖపరువులలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. హఠాత్తుగా వీచిన ఈదురుగాలులకు గిరిజనులు ఇళ్ల పైకప్పులు కళ్లముందే ఎగిరిపోతుంటే వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ గాలులకు దాదాపు 17 ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



గరుగుబిల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి



సాలూరు: వైఎస్సార్‌సీపీలో చేరినవారితో పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని 1,2వ వార్డులకు చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. 1వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు రౌతు అప్పారావు ఆధ్వర్యంలో యుగంధర్‌రాజు, చిత్తాపు బుజ్జి, షేక్ వహిద్, గోవిందరెడ్డి, రౌతు సాయి, పి.శేఖర్, చిత్తాపు నీలమణి, పీబీఎస్ శ్రీనివాసరావు, కృష్ణరాజు, సుశాంత్‌పండా, శేఖర్, పవన్‌కుమార్ తదితర సుమారు 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే 2వ వార్డుకు చెందిన నడుకూరి గణపతి, మీగడ లక్ష్మణరావుల ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో అందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని రాజన్నదొర ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, గిరిరఘు, గొర్లె మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సంతోషపురంలో 15 కుటుంబాలు

గరుగుబిల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్ఆర్‌సీపీలో పలువురు చేరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని సుంకిలో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం సంతోషపురం గ్రామానికి చెందిన వార్డు మెంబర్ గొట్టాపు రామినాయుడు, బంకురు చందు, బంకు బావాజీ నాయుడు, మరిశర్ల తాతబాబు, వాసు, మూడడ్ల రాముతోపాటు 15 కుటుంబాల వారు ఆమె సమక్షంలో పార్టీ కండువాలు వేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ విజయానికి తమవంతు కృషిచేస్తామని పార్టీలో చేరిన వారంతా స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మాజీ సర్పంచ్ అంబటి గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పార్వతీపురం ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు జరుగుతున్నాయని ఆ పార్టీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడు సీరాపు వెంకట మహేష్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ కండువా వేసుకుని వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఆయనకు పార్టీలోకి సాదర స్వాగతం పలుకుతూ పార్టీలో అందరికీ సముచిత గౌరవం ఉంటుందని, అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన ప్రజలందరికీ మేలు చేసేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి, స్టేట్ డైరెక్టర్ మజ్జి నాగమణి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు సీరాపు వెంకట మహేష్